స్ట్రాంగ్ రూములు నిరంతర పర్యవేక్షణ

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్, అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి .అభిషేక్, అడిషనల్ ఎస్పీ ధీరజ్ సంయుక్తంగా డిగ్రీ కళాశాలను సందర్శించి స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ప్రతిరోజు స్ట్రాంగ్ రూములో తనిఖీల్లో భాగంగా బుధవారం సందర్శించి స్ట్రాంగ్ రూములను తనిఖీ చేశారు. ఓట్లు లెక్కింపు విభాగాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం లాగ్‌బుక్‌లో అధికారులందరూ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఈఈ డివిఆర్ ఎం.రాజు,డి.ఈ అనుదీప్, సిఐ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర-సీతంపేట : ఐటీడిఏ పరిధిలో గల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కొరకు ఏపీ ఆర్ బాయ్స్ కళాశాలలో బాలురు-170, బాలికలకు 140 మెరిట్ ప్రాతిపదికన- 310 మంది విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అదేవిధంగా పెద్దమడి కళాశాలలో 56 సీట్లు కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయడం జరిగింది అని తెలిపారు. ఇంకా మిగిలినవి ఎంపీసీ గ్రూప్ నందు 26, బైపిసి గ్రూపు నందు 15, సీఈసీ గ్రూప్ నందు 23 సీట్లు మిగిలి ఉన్నాయని కన్వీనర్ ప్రిన్సిపల్ పి. సూర్యకుమారి తెలిపారు. ఈ కౌన్సిలింగ్ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ ఎం.శ్రీనివాసరావు, బాలురు కళాశాల ప్రిన్సిపల్ పివి రామారావు, పెద్దమడి గురుకుల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, గురుకులం సూపర్డెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి పలు పాఠశాలలు తనిఖీ

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి పి బ్రహ్మాజీరావు మండలంలో బుధవారం సుడిగాలి పర్యటన చేసి పలు పాఠశాలలను తనిఖీలు నిర్వహించారు. మండలంలోని వనుగుమ్మ పంచాయతీ సంగడ గవర్నమెంట్ ప్రభుత్వ పాఠశాల భవనం పై కప్పులు భారీ ఈదురు గాలి వర్షానికి పైకప్పులు ఇటీవల ఎగిరిపోయిన విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాల సందర్శించి మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు చేస్తున్నామని ఆయన అన్నారు.అలాగే మచ్ ఖండ్ ఎలక్ట్రికల్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ స్కూల్లో సంగడ సందర్శించి రికార్డ్స్, స్టూడెంట్స్ హాజరు పట్టి లు, ల్యాండ్ రికార్డ్స్, టీచర్ అటెండన్స్, తనిఖీ నిర్వహించారు .ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు మాట్లాడుతూ భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి పాఠశాల పైకప్పులు ఎగిరిపోయిందని మరమ్మత్తులు నిర్వహించేందుకు నిధులు మంజూరు చేస్తున్నామని త్వరితగతిన పనులు ప్రారంభించాలని మండల విద్యాశాఖ అధికారి కే కృష్ణమూర్తికి డీఈవో ఆదేశించారు.అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి పలు సూచనలు సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సి ఆర్ పి భాస్కర్ ఎం ఆర్ సి స్టాప్ స్టాఫ్ పాల్గొన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-జీకే వీధి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశము ఈనెల 28వ తేదీన జరగనుంది. ఈ మేరకు ఆ రోజు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రజా ప్రతినిధులు మండల వివిధ శాఖల అధికారులు ఈ సర్వసభ్య సమావేశానికి అందరూ విధిగా హాజరు కావలసిందిగా జికే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు ముమ్మరం

సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

విశాలాంధ్ర-రంపచోడవరం : వచ్చేనెల నాలుగో తారీఖున జరుగు ఓట్ల లెక్కింపునకు ఎక్కడికక్కడ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం గిరిజన సంక్షేమ శాఖ బాలికల జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేయుచున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలలలో చేయుచున్న పనులను రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్, రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ హెచ్ పరిశీలించడం జరిగింది. ముందుగా స్ట్రాంగ్ రూములను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ వచ్చేనెల 4వ తారీఖున జరగనున్న అసెంబ్లీకి, పార్లమెంటుకు ఓట్ల లెక్కింపు కేంద్రాలను వేరువేరుగా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల లోపలికి ఏజెంట్ పాస్లు ఉన్న వారిని మాత్రమే అనుమతించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా ఇతరులను ఎట్టి పరిస్థితుల్లోనూ కౌంటింగ్ కేంద్రాల లోపలికి అనుమతించబడరని ఆయన తెలిపారు. రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ వచ్చే నెల నాలుగో తారీఖున జరగనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాల చుట్టుప్రక్కల ప్రతిష్టాత్మకమైన భద్రత ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు అదేవిధంగా 144 సెక్షన్ కూడా అమలులో ఉంటుందని ప్రజలందరూ ఈ విషయాన్ని గ్రహించగలరని ఆయన తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున ఎవరైనా ఎన్నికల సంఘం విధానాలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎక్కడికక్కడ పోలీస్ గస్తీ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున ఆయా మండలాల పరిధిలోని సెలబ్రేట్ చేసుకోవాలని ప్రజలను ఆయన తెలియజేయడం జరిగింది. ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు 24×7 ప్రతిష్టాత్మకమైన కేంద్ర బలగాలతో స్ట్రాంగ్ రూములలో ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు, తహసిల్దార్లు ఎ. కృష్ణ జ్యోతి, నజీముల్లా, డిప్యూటీ తాసిల్దార్ కె.సుధాకర్ బాబు. సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జి యం యల్ నాయుడు, సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. వెంకటేశ్వరరావు, సబ్ ఇన్స్పెక్టర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత

వ్యర్థ పదార్థాలు ఎక్కడబడితే అక్కడ వేయొద్దు
వారపు సంతలో వ్యాపారస్తులకు సూచిస్తున్న సర్పంచ్ పుష్పలత

విశాలాంధ్ర-చింతపల్లి : పరిసరాల పరిశుభ్రతకు సహకరించకుంటే పంచాయితీ పరంగా చర్యలు చేపట్టక తప్పదని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వారపు సంతను పురస్కరించుకుని సంతలో పంచాయతీ కార్యదర్శి కే శ్రీనివాస్, వార్డు సభ్యులు ఎర్రం శెట్టి వెంకటేశ్వరమ్మ (బుజ్జి), వసుపరి వెంకటలక్ష్మి, పులిమెట్ల కామాక్షితో కలసి ఆమె కలియతిరిగారు. ఈ సందర్భంగా వారపు సంతకు వచ్చే వ్యాపారులు, వ్యాపారాలు నిర్వహించుకునే క్రమంలో చేపలు, మాంసము, కూరగాయలు, అరటి గెలలకు చుట్టివచ్చే అరటి ఆకులు, ప్లాస్టిక్ తదితర వ్యర్థ పదార్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయరాదని, ఎప్పటికప్పుడు క్రిమి రహితం చేయాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన ప్రస్తుతం మన్యంలో మధ్యాహ్నం వరకు ఎండ, మధ్యాహ్నం నుంచి వర్షం

కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. అదేక్రమంలో దుకాణ సముదాయాల చెంతనే గాక, గృహాల సమీపంలో కూడా చెత్తాచెదారం, నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రధాన రహదారులు, మురుగు కాలువలు, పురవీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వలన మురుగునీరు పారే అవకాశాలు సన్నగిల్లుతున్నాయని తద్వారా దోమలవ్యాప్తి ఎక్కువ అవుతుందన్నారు. దీంతో వ్యాధులను వ్యాపింపజేసే క్రిమి కీటకాలు వృద్ధిచెంది ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అటువంటి వాటిని నివారించాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన అవసరం ఉందన్నారు. గృహాలలో వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతిరోజు పురవీధులలోకి వచ్చే పంచాయతీ వాహనంలోనే వేయాలని పిలుపునిచ్చారు. అదే క్రమంలో దుకాణ సముదాయాలు, హోటళ్ల వద్ద చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, దుకాణాల చెంత ఉన్న మురుగు కాలువలలో చెత్త పేరుకు పోకుండా చూసుకునే బాధ్యత వ్యాపారస్తులపై ఉందన్నారు. లేనిపక్షంలో పంచాయతీ పరంగా జరిమానా విధించవలసి ఉంటుందని ఆమె హెచ్చరించారు.

గురుకుల కళాశాలలో సీట్ల భర్తీ

విశాలాంధ్ర-పాడేరు : బాలికల గురుకుల కళాశాలలో 450 సీట్లు భర్తీ చేశారు. అరకు బాలికల కళాశాలలో 160 పాడేరు బాలికల గురుకులం కళాశాలలో 170, జీకే వీధి గురుకుల కళాశాలలో 120 సీట్లు భర్తీ చేశారు.

వ్యర్థాలతో సాగుకు ఇబ్బందులు

విశాలాంధ్ర-జి కే వీధి : మండల కేంద్రంలో దుకాణాల నుండి ప్లాస్టిక్ కవర్లు కాళీ సీసాలు పొలాల్లోకి వ్యర్థాలు కొట్టుకు రావడంతో సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండలంలోని పూజారిపాకల గ్రామానికి చెందిన గిరిజన రైతులు పంచాయతీ సెక్రెటరీ ఫిర్యాదుచేశారు. స్థానికంగా దుకాణాల నుంచి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలు పొలంలోకి వచ్చేస్తున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళ రైతు పూజారి లింగాలమ్మ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు బుధవారం విన్నవించారు. స్పందించిన పొలాలను పరిశీలిం చారు. వ్యర్థాలు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు

విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
కావాల్సిన ప్రాంతం : కొయ్యూరు
సంప్రదించవలసిన నెం : యర్రయ్యరెడ్డి
7989138129,7386603589

స్వచ్ఛమైన తాగునీటిని అందించండి

మున్సిపల్ కార్యాలయం ఎదుట మహిళల నిరసన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పట్టణంలో విడుదలవుతున్న బురద నీటి సమస్యను శాశ్వతంగా నివారించాలని, ప్రతిరోజు నీటిని విడుదల చేసేటట్లుగా తగు చర్యలు చేపట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, పిల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట మహిళలతో నిరసన చేపట్టారు.అనంతరం డిఈ కిరణ్ కుమార్ కు వినతిపత్రాన్ని అందయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజులుగా మంచి నీరు అందడం లేదని, వస్తున్న కొద్దిపాటి నీటిలో బురద నీరు రావడంతో త్రాగుటకు ఉపయోగకరంగా లేదని, వీధి లైట్లు పూర్తిగా వెలగడం లేదని, అలాగే రోడ్లు వేయడం వలన బోర్లు కిందకైపోవడంతో నీళ్లు పట్టుకోవడానికి చాలా ఇబ్బందికరంగా ఉందని గత కొన్ని రోజులుగా స్థానిక ప్రజాప్రతినిధులకి, ఉన్నత సిబ్బందికి తెలియజేసిన స్పందించడం లేదని తెలిపారు. ఒకవైపు మండుట ఎండా కాలంలో జిల్లా కేంద్రం మున్సిపాలిటీ పట్టణంలో త్రాగునీరు, విద్యుత్తు సకాలంలో అందించకపోవడం దౌర్భాగ్యం అని, వెంటనే స్పందించి బురద నీళ్లు తరచుగా రావటానికి గల కారణాన్ని పరిశీలించి మరియు పైపులైన్లు మరమ్మతులు చేపట్టి, పట్టణంలో బురద నీళ్లు నివారించుటకు తగిన చర్యలు చేపట్టాలని, ప్రతిరోజు కుళాయి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పిల్లి అరుణ, పిల్లి రమ్య, సరస్వతి, ఎన్. అప్పాయ్యమ్మ, ఆదిలక్ష్మి, కోళ్ల విజయ, సునీత, వెంకటలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు పి. రాజశేఖర్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసిన ప్రతీ గిరిజన విద్యార్థికి సీటు ఇవ్వాలి

గిరిజన సంక్షేమ సంఘం

విశాలాంధ్ర-బెలగాం : గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో సీటు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ గిరిజన విద్యార్థికి సీటు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్ లు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని సీతంపేట, పార్వతీపురం ఐటిడిఏ పరిధిలోని ఎనిమిది గిరిజన గురుకుల కళాశాలల్లో 1030 సీట్లకు 2572 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈనేపథ్యంలో సీట్లు పెంచి ప్రతీ గిరిజన విద్యార్థి కి సీటు ఇవ్వాలని డిమాండ్ చేసారు. గతంలో పార్వతీపురం ఐటిడిఏ పరిధిలోని కొమరాడ గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఇంటర్మీడియట్ స్థాయికి పెంచుతామని ప్రకటన చేసినా జరగలేదని అలాగే ప్రతీ సహాయ గిరిజన సంక్షేమశాఖ అధికారి (ఎటిడబ్ల్యూఓ) పరిధిలోని రెండు (బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి చొప్పున) గిరిజన ఆశ్రమ పాఠశాలలను కళాశాల స్థాయి చేసి ఇంటర్మీడియట్ చదువులు అందిస్తామని అధికారులు, పాలకులు చెప్పినా ఆచరణలో అమలుకాలేదని వారన్నారు. పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన జిల్లాలో ఇంటర్మీడియట్ గిరిజన గురుకుల విద్య అందరికీ అందే విధంగా జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పిఓలు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫచ్చిరొట్ట విత్తనాలు 90% రాయితీపై పంపిణీ

విశాలాంధ్ర-సీతంపేట: మండల పరిధిలోగల రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పచ్చరొట్ట విత్తనాలు 90% రాయితీపై పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారిని శ్రీదేవి తెలిపారు. అవసరమైన రైతులు తమ పరిధిలోగల రైతు భరోసా కేంద్రాలలో ముందుగ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి, సీతంపేట వారు పత్రిక ప్రకారం ద్వారా తెలిపారు.

సిబిఎస్ఈ శిక్షణా తరగతులకు 175మంది ఉపాధ్యాయులు హాజరు

విశాలాంధ్ర-కురుపాం : పార్వతీపురం మన్యం జిల్లా లోని 40 సిసిఎస్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు కురుపాం స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో మీద ఇంగ్లీష్, సోషల్, బయాలజీ సబ్జెక్టుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ ట్రైనింగ్‌కు కోర్స్ డైరెక్టర్‌గా డిప్యూటీ డిఇఓ పి.క్రృష్ణమూర్తి వ్యవహరించగా 175మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. జిల్లా విధ్యాశాఖాధికారి పగడాలమ్మ సందర్శించారు. సిబిఎస్ఈ స్టేట్ కోఆర్డినేటర్ శారదా పరిశీలించారు. ఎల్ఎఫ్ఈ మెంబర్, నాగరాజు, మండల విధ్యాశాఖాధికారి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాగతం పలుకుతున్న కురుపాం సమస్యలు

విశాలాంధ్ర-కురుపాం : 2024ఎన్నికల్లో విజయం సాధించి కొత్త బాధ్యతలు చేపట్టబోయే ఎమ్మెల్యేకి, కొత్త ప్రభుత్వానికి కురుపాం నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలు గాలికి వదిలేసిన రాజకీయ పార్టీలకు ఎన్నికలు విజయం అనంతరం నూతన బాధ్యతలు చేపట్టే తరుణంలో వదల... బొమ్మాళి...

అంటూ దీర్ఘకాలిక సమస్యలు ముందుగా మమ్మల్ని పరిష్కారించేందుకు దృష్టి పెట్టండంటూ స్వాగతిస్తున్నాయి. గత ప్రభుత్వాలు, ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్న సమయంలో పరిష్కారం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేయక ప్రతిపక్షంలో సమస్యలపై పూర్తిస్థాయిలో పోరాడకుండా కాలక్షేపం చేసిన కారణం ఈ

దీర్ఘ కాలిక సమస్యలు కురుపాం నియోజకవర్గం ఓటర్లను వెక్కిరిస్తూ ఉన్నాయని చెప్పక తప్పదు. పుష్కలమైన జలవనరులు ఉన్న నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులపై తాత్సారం చేయడంవల్ల రైతాంగం రైలెక్కి పట్టణాలకు వలసలు వెళ్లి పోవాల్సిన దుస్థితి గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ (వైఎస్సార్, చంద్రబాబు ఇద్దరూ హామీ ఇచ్చారు. యుపిఏ-1లో నిధులు మంజూరు అయ్యాయి. కుంటిసాకులతో వెనుతిరిగాయి). దశాబ్దాల హామీ (ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 15వేల ఎకరాల సాగు నీటి వనరు) బికేధారిపురం సీమలగెడ్డ రిజర్వాయర్, బివనకాబడి రిజర్వాయర్ (కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాలకు ఉపయోగపడుతుంది) దశాబ్దాలుగా నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టుగా జంఝావతి రిజర్వాయర్ ఒరిస్సాతో చర్చలు సఫలం కాకుండా పోవడంతో నిలిచింది. ఏళ్ళు గడిచినా నియోజకవర్గాన్ని వదలని ఏనుగుల గుంపు అవి చనిపోతూ కొందరు(13) మనుషుల ప్రాణాలు తీసేయటమే కాకుండా వేల ఎకరాల పంటలు నాశనం చేస్తూనే ఉన్నాయి. అర్థాంతరంగా నిలిచిపోయి ఏటా ప్రాణాలను బలిగొంటున్న పూర్ణపాడు లాబేసు వంతెన. ఏజెన్సీ మండలాల ఆయువు పట్టు కురుపాం సామాజిక ఆసుపత్రి వందపడకల ఆసుపత్రిగా అభివృద్ధి ఏర్పాటుకు నోచుకోని స్వయం ఉపాధి కేంద్రాలు అటవీ ఉత్పత్తుల ప్రోసెసింగ్ యూనిట్‌లు వలసపోతున్నా గిరిజన యువత మన్యాన్ని వీడని తాగునీటి సమస్య దిష్టి బొమ్మలను తలపిస్తోన్న జలజీవన్ మిషన్ తాగునీటి పథకాలు ఇంకా చెలిమి నీరు పై ఆధారపడి జీవిస్తున్న గిరి శిఖర గ్రామాలు పడకేసిన సప్పగొత్తిలి, విశ్వనాథ పురం ఎత్తి పోతల పథకాలుతో పాటు మరికొన్ని, అర్థాంతరంగా ఆగిన రేగిడిగెడ్డ ఒట్టిగెడ్డ అనుసంధానం పనులు,రహదారి నిర్మాణానికి నోచుకోని గిరి శిఖర గ్రామాలు ఇంకా తప్పని డోలీమోతలు ప్రసవవేదన అరణ్య రోధనే... కురుపాం మన్యంలో, నాణ్యమైన వసతులు, వైద్యంలేక గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏటా ఆగని మృత్యుఘోష ప్రారంభించి నాలుగేళ్లైనా పూర్తికాని కురుపాం రహదారి విస్తరణ, బిటి రహదారి పనులు.

మైనింగ్ క్వారీలను సబ్ డివిజన్ ఏఎస్పీ తనిఖీ

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని మైనింగ్ క్వారీలను పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పి సునీల్ షరోన్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఆయన తనిఖీలు చేసి క్వారీల యజమానులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇసుక రీచ్లు, మైనింగ్ క్వారీలను తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు పార్వతీపురం గ్రామీణ సిఐకే రవికుమార్ స్థానిక ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

రక్తహీనతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం : రక్తహీనతపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అదికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరు క్యార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి వైద్యాధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో గర్భిణిలలో రక్తహీనత, ప్రసవ మరణాలు, తల్లిబిడ్డల నమోదు, ఎబిహెచ్ఎ యాప్ నమోదు, ఆసుపత్రిప్రసవాలు, బర్త్ ప్లానింగు, కంటివెలుగు, 108 వాహనాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ గర్భిణీలలో రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం రక్తహీనత గల గర్భిణీ స్త్రీలకు అందించిన సేవలపై సమీక్ష నిర్వహించి నివేదిక అందించాలని తెలిపారు. మండల అభివృద్ధి అధికారులు, మహిళాశిశు సంక్షేమశాఖ అదికారులు, వైద్యసిబ్బంది తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ప్రసవ మరణాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని, అన్నిఆసుపత్రులలో సౌకర్యాలు కల్పించడం జరిగిందని, ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు చేయాలని తెలిపారు. ఆసుపత్రులలో విద్యుత్ అంతరాయం కలుగకుండా అవసరమైన పత్యామ్నాయ ఏర్పాట్లు చేయటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం చూపించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా దోమలు నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 400 గ్రామాలలో స్ప్రేయింగు చేయాలని, స్ప్రేయింగుకు సరైన పద్దతిలో సంబంధిత అధికారుల పర్యవేక్షణలో జరగాలని తెలిపారు. స్ప్రేయింగు ప్రక్రియ సక్రమంగా చేయుటకు ప్రజల సహకారం అవసరమని అందుకు గాను స్థానికులు, ఉద్యోగులు సహకారం తీసుకొని సమన్వయంతో పూర్తిచేయాలని తెలిపారు. డెంగ్యూ వ్యాది పట్టణ ప్రాంతాలలో ఎక్కువగా ఉంటుందని, డ్రైడే తప్పని సరిగా పాటించాలని తెలిపారు. కాలువలలో పూడికతీత, బహిరంగ స్థలాలలో నీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా వైద్యఆరోగ్య అదికారి డా. కె.విజయపార్వతి, డిఐఒ డా. ఎం నారాయణ, డా. ఎం వినోద్, డా. శివకుమార్, డా. డిఎల్ఆర్ రఘుకుమార్, డా. టి జగన్మోహన రావు, మెడికల్ ఆఫీసర్లు, పి. హెచ్.సి. డాక్టర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలు సంయమనం పాటించాలి: ఎస్ఐ రాజేష్

విశాలాంధ్ర-సీతానగరం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగు జూన్ 4న జరగనున్నందున అంతవరకు మండల ప్రజలు సంయమనం పాటించాలని ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. బుధవారం మండలంలోని సుమిత్రపురం, పెదంకలం గ్రామాల్లోని ప్రధానకూడల్లువద్ద నాయకులతో, ప్రజలతో ఎస్ఐ రాజేష్ మాట్లాడారు.ఎన్నికలకు సహకరించిన తరహాలో జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ జరగనున్నందున అప్పటి వరకు ప్రజలు సంయమనంతో ఉండాలని, ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎక్కడ ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలని కోరారు. ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఇప్పటికే నమోదు చేసిన బైండోవర్ వ్యక్తులపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఎస్పీ, ఇతర పోలీస్ అధికారుల ఆదేశాలతో పాటు పార్వతీపురం శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారయిన ఆర్డీఓ ఆదేశాలు మేరకు ఎన్నికల కౌంటింగ్ వరకు అన్ని గ్రామాల్లో24గంటలపాటు నిఘా పెట్టామని తెలిపారు. గ్రామాల్లో గొడవలకు ఎవరైనా ప్రేరేపిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలకు సహకరించినట్లే, కౌంటింగ్ వరకు కూడా పూర్తి సహకారాన్ని అందించి శాంతిభద్రతలు ప్రశాంతంగా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. నిరంతరం అన్ని గ్రామాలలో పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

రోడ్లపైనే మురికినీరు

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం మున్సిపాలిటీ 14వ వార్డు గూడ్స్ షెడ్ రోడ్డుసైడ్ కాలనీ వీధుల్లోని కాలువల్లో పూడిక తీయక పోవడంతో రోడ్లపైనే మురికినీరు ప్రవహిస్తుందని స్థానికులు వాపోతున్నారు. దీనితో దుర్గంధం వెదజల్లి అనారోగ్యం పాలవు తున్నామని స్థానికులు వాపోతున్నారు. రాబోయే వర్షాకాలంలో ఇంకా దుర్గధం ప్రబలి అనారోగ్యాలకు గురైతే గానీ అధికారులు చలించరా అని, ఇకనైనా మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి దుర్గధం బారినుండి కాపాడాలని కోరుతున్నారు.

24న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేఖ పల్లిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశాలలో ఈనెల 24 ఉదయం 10గంటలకు ఎంపిపి కారం లక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించబడుననీ ఎంపిడిఓ ఫణీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశించిన సమయానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర ప్రగతి సమాచారం తీసుకొని హాజరు కావాలని ఆయన తెలిపారు.

గత సమావేశం లో చర్చించిన సమస్యలు పరిష్కారం ప్రగతి అభివృద్ధి వంటి సమాచారం తో అధికారులు సంసిద్ధం అయి రావాలని ప్రజా ప్రతినిధులు ఎంపిటిసి లు సర్పంచ్ లు తప్పక హాజరు కావాలని తెలిపారు.

సమష్టి కృషి, భాగస్వామ్యంతోనే జీవ వైవిధ్య పరిరక్షణ

- జీవ వైవిధ్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి
- 2030 నాటికి అన్ని రంగాలకు సుస్థిర ప్రయోజనాలు అందుతాయని ఆశాభావం
- విశాఖ వేదిగా అట్టహాసంగా జాతీయ స్థాయి జీవ వైవిధ్య దినోత్సవ వేడుకలు
- భాగస్వామ్యమైన జాతీయ, రాష్ట్ర స్థాయి అధికార ప్రముఖులు, అవార్డు గ్రహీతలు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : అన్నివర్గాల ప్రజల సమష్టి కృషి, భాగస్వామ్యంతోనే జీవ వైవిధ్య పరిరక్షణ సాధ్యమవుతుందని, తద్వారా 2030 నాటికి అన్ని రంగాలకు సుస్థిరమైన పర్యాణాభివృద్ధి ఫలాలు అందుతాయని, ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ బయో డైవర్శిటీ బోర్డు తీవ్ర కృషి చేస్తోందని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు చిరంజీవి చౌదరి (ఐ.ఎఫ్.ఎస్) పేర్కొన్నారు. సుస్థిర పద్ధతిలో ప్రయోజనాలు అందించేందుకు, జీవ వైవిధ్య పరిరక్షణ లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాయుత చర్యలతో ముందుకెళు తోందని ఉద్ఘాటించారు. 1. జీవ వైవిధ్య పరిరక్షణ, 2. జీవ వనరుల స్థిరమైన వినియోగం, 3. అన్ని వాటాదారుల మధ్య జీవ వనరుల న్యాయమైన, సమానమైన భాగస్వామ్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు నిర్దేశించుకుందన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏయూ కన్వెన్షన్ హాలులో బుధవారం నిర్వహించిన జాతీయ స్థాయి జీవ వైవిధ్య దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు అన్ని స్థానిక సంస్థల స్థాయిలో బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. జాతీయ స్థాయిలో- జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ, రాష్ట్ర స్థాయిలో - ఏపీ రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు, స్థానిక స్థాయిలో - బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలు (%దీవీజ%లు) పని చేస్తున్నాయని వివరించారు. జీవవైవిధ్య పరిరక్షణ ఆవశ్యకత, స్థిరమైన వినియోగంపై అవగాహన పెంచడానికి ప్రజలు, విద్యార్థులు, వివిధ వర్గాల వారి ప్రమేయం, భాగస్వామ్యంతో ప్రతి సంవత్సరం మే 22న జీవ వైవిధ్య దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. "ప్రణాళికలో భాగస్వామ్యం అవ్వండి" అనే అంశం ఆధారంగా ఈ సంవత్సరం రెండు రోజుల జాతీయ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు.

వేగవంతంగా చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పులు ఇతర పరిస్థితుల ప్రభావం జీవ వైవిధ్యంపై ఉందని, దానిని దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాయుత చర్యలకు రంగం సిద్ధం చేశామని పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలకు సుస్థిర ప్రయోజనాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి వెల్లడించారు. సంప్రదాయ జ్ఞానం... ఆధునికతకు అనుసంధానం కావాల్సిన ఆవశ్యకత ఉందని అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని అన్నారు. కేరళ రాష్ట్రంలో ఖానీ గిరిజన తెగ ప్రజలు అందించిన సంప్రదాయ జ్ఞానం ఆధునికతను సంతరించుకొని క్రీడా రంగంలో ఎంతో మందికి ఉపయోగపడుతోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జీవ వైవిధ్యం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ద్వారా ఆహార భద్రత కళ సాకారమవుతుందని పేర్కొన్నారు. జీవ వైవిధ్య పరిరక్షణ, ఇతర లక్ష్యాల సాధనకు ప్రజల భాగస్వామ్యం ఎంత అవసరమో... సరికొత్త సంస్కరణలతో కూడిన విధి విధానాలు కూడా అవసరమని అభిప్రాయపడ్డారు. విద్యా రంగంలో కూడా మరిన్ని సంస్కరణలు రావాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. జీవ వైవిధ్యంలో విశాఖపట్టణం ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుందని, ఇక్కడ ఎన్నో అవకాశాలు, సహజ వనరులు ఉన్నాయని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డ్ ద్వారా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి చిరంజీవి చౌదరి వివరించారు.

50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏయూలో బయో డైవర్సిటీ పార్కు : ఏయూ వీసీ

రాబోయే 50 ఏళ్లలో సమాజంలోని అన్ని రంగాల, వర్గాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఏయూ ప్రధాన కేంద్రంగా బయో డైవర్సిటీ పార్కును నెలకొల్పుతున్నామని ఆ దిశగా ఇప్పటికే పలు చర్యలు చేపట్టామని ఆంధ్రా యూనివర్శిటీ వీసీ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బోటనీ, జువాలజీ, మెరైన్ లివింగ్ డిపార్ట్మెంట్ల సహకారంతో ఏయూ పరిసరాల్లో పచ్చదనానికి, పర్యావరణ పరిరక్షణకు అనేక చర్యలు చేపట్టామన్నారు. 15 నుంచి 80 ఏళ్ల వయసు కలిగిన 27,800 రకాల వృక్షజాతులు ఏయూలో ఉన్నాయని వెల్లడించారు. జీవ వైవిధ్య పరిరక్షణకు సంబంధించిన అన్ని రకాల కార్యకలాపాలు చేపడుతున్నామని, దాని ఫలితంగానే దేశంలో గుర్తింపు పొందిన రెండు గ్రీన్ యూనివర్శిటీల్లో ఏయూ ఒకటిగా నిలిచిందని అన్నారు. ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ, వాటికి ప్రభుత్వాలు, మీడియా ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తించిన ఏయూ యాజమాన్యం కన్వెన్షన్ హాలును తాబేళు ఆకారంలో నిర్మించిందని గుర్తు చేశారు. పర్యావరణ పరిక్షణ, జీవ వైవిధ్యానికి ఏయూలో ఇస్తున్న ప్రాధాన్యతకు తగ్గట్టుగా 59 దేశాల నుంచి విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారని, వారికి కావాల్సిన ఆహార పంటలను వారే స్వయంగా పండించుకుంటున్నారని తెలిపారు.

ఏపీ స్టేట్ బయో డైవర్శిటీ బోర్డు మెంబర్ సెక్రటరీ బీవీఏ కృష్ణ మూర్తి, విశాఖపట్టణం జిల్లా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఎస్. శ్రీకాంత్ నాథ్ రెడ్డి, జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ ప్రతినిధి ప్రొ. హంచినల్ రాయప్ప రామప్ప, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్శిటీ వీసీ టి. జానకీరామ్ కార్యక్రమంలో భాగంగా ప్రసంగించారు. జీవ వైవిధ్య పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని, అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. మానవ ప్రేరేపిత నష్టాలను నివారించి... సుస్థిర ప్రయోజనాలను అందుకునే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా అతిథులందరూ అక్కడ వివిధ విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లను సందర్శించారు.

వేడుకల్లో భాగంగా వివిధ రకాల పుస్తకాలను, బ్రోచర్లను అతిథులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం విశిష్ట సేవలందించిన వారికి అవార్డులు, ధృవీరణ పత్రాలు అందజేశారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వివిధ పాఠశాలల విద్యార్థులకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు.

కార్యక్రమంలో డీఎఫ్‌వో అనంత్ శంకర్, జ్యూ క్యురేటర్ నందినీ సలారియా, రాజమండ్రి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్, ఉత్తరాంధ్ర జిల్లాల ఫారెస్ట్ డిపార్ట్మెంటు అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు

108 మట్టి కళశాలతో అష్టోత్తరశత కలశాభిషేక కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-సీతానగరం : సీతానగరం మండలకేంద్రంలోగల శ్రీవేణుగోపాలస్వామి ఆలయప్రాంగణంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రీలక్ష్మీనృసింహ జయంతి(తిరునక్షత్ర కార్యక్రమం) సందర్భంగా ప్రత్యేక పూజలను బుదవారం నిర్వహించారు. స్వామివారికి అష్టోత్తర శతకలశాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాలు సాక్షిగా సహస్ర నామ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయప్రదాన అర్చకులు పీసపాటి శ్రీనివాసా చార్యులు, పీసపాటి రామానుజాచార్యులు, ఆమంచి శ్రీనివాసా చార్యులు, కె.మురారి,బృందావనం ఉదయ కృష్ణమాచార్యులు, పవణ్ కళ్యాణ్ ఆచార్యులు, మనోజ్ వంశీ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో నృసింహ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త చెలికాని వెంకట గోపాలకృష్ణ-భారతి దంపతులతోపాటు పెద్దఎత్తున భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.పూజలయ్యాక స్వామివారి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

కేజీబీవీ పాఠశాలలో అందరినీ యదావిధిగా కొనసాగించాలి

విశాలాంధ్ర-బెలగాం : రాష్ట్రంలోని కెజిబివి పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అందరినీ ఎటువంటి నిబంధనలు లేకుండా యధావిధిగా కొనసాగించాలని "సామాజిక చైతన్య వేదిక" ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి. రంజిత్ కుమార్ డిమాండ్ చేసారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం పనితీరును బట్టి మరుసటి సంవత్సరం కొనసాగించాలనే ఆలోచన మానుకోవాలని కోరారు. కెజిబివిలను బలోపేతం చేసి బాలికల విద్యకు ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

సారవంతమైన నేలకు పచ్చిరొట్ట విత్తనాలు

సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదనరావు

విశాలాంధ్ర-పాచిపెంట... రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగపరుచుకుని భూసారాన్ని పెంచే దిశగా చూడాలని సాలూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్ రావు అన్నారు. పనుకువలస పంచాయతీ కోస్ట్ వలస మరియు మంచాడపలస గ్రామాలలో జీలుగ కట్టే జనుము మరియు పిల్లి పెసర పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు పొందాలంటే కేవలం రసాయన ఎరువులు మీద మాత్రమే ఆధారపడితే సరిపోదని వేసిన రసాయన ఎరువులు కూడా పంటకు పూర్తిస్థాయిలో అందాలంటే భూమిలో పోషకాల సమతుల్యత ఉండాలని కాబట్టి భూమిలో భూసారంగా పిలుచుకునే సేంద్రియ కర్బన శాతం పెరగాలంటే రైతులు తప్పనిసరిగా రాయితీ పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకుని పూత దశలో కలియ దున్నాలని తెలిపారు.

పచ్చి రొట్ట విత్తనాల ప్రయోజనాలు:

1. ఏకపంట విధానంలో పంట మార్పిడి విధానానికి సహాయపడుతుంది
2. నేలను గుల్లపరిచి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది
3. భూమిలో పోషక సమతుల్యతను సాధిస్తుంది
4. రైతు మిత్రుడుగా పిలవబడే వానపాముల వృద్ధి జరుగుతుంది
5. సేంద్రియ కర్బన శాతం పెరిగి భూసారం పెరుగుతుంది
6. భూమిలో జీవవైవిధ్యం పెరుగుతుంది
7. కలుపు సమస్య ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతుంది
8. వేసిన రసాయన ఎరువులకు ప్రధాన పంటల ప్రతిస్పందన బాగుంటుంది
9. ఆరోగ్యవంతమైన చీడపీడలు తట్టుకునే అధిక దిగుబడులు సాధించవచ్చు

ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నటువంటి పచ్చిరొట్ట విత్తనాలను రైతులందరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని తెలిపారు అనంతరం రైతులను డి కృషి యాప్‌లో నమోదుచేసి విత్తనాలను రాయితీపై పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్ కుమార్ మరియు మోహన్ కుమార్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఉపేక్షించేది లేదు

డొంకరాయి ఎస్సై శివకుమార్

విశాలాంధ్ర-చింతూరు : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్, ఫలితాల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని డొంకరాయి ఎస్సై శివకుమార్ రాజకీయ నాయకులకు హెచ్చరించారు. ఈమేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తూహిన్‌సిన్హా , చింతూరు ఇన్చార్జి ఏఎస్పీ రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వరరెడ్డి, చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాలతో బుధవారం డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పొలిటికల్ పార్టీ నాయకులతో ఎస్సై శివకుమార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరంగానీ లేదా రాజకీయ కక్ష్యతోగానీ, అల్లర్లు ప్రేరేపించే విధంగా ఏదైనా అవాంఛనీయ సంఘటనలు తలెత్తిన, ఆందోళనకారులు హింసాత్మక చర్యలకు పాల్పడినా, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు గొడవలు అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తే చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకూ డొంకరాయి పరిధిలో ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోలేదని, అందుకు సహకరించిన ప్రతీఒక్క నాయకునికి కృతజ్ఞతలు తెలిపారు. ఇకముందు కూడా ఎటువంటి గొడవలు అల్లర్లు జరగకుండా చూడాలని పార్టీ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో డొంకరాయిపోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వేలం ద్వారా అమ్మవారి ఆదాయం రూ.7లక్షల 17వేలు

విశాలాంధ్ర-దేవీపట్నం : మండలంలోని పూడిపల్లి పంచాయతీ గొందూరు గ్రామంలో వేంచేసిన మాతృశ్రీ గండి పోశమ్మ ఆలయంకు సంబంధించి ఆలయంవద్ద భక్తులకు విక్రహించే కొబ్బరి చెక్కలలో సగభాగం, ఫోటోలు విక్రయం ద్వారా భక్తులు అమ్మవారికి సమర్పించే చీరలు రవికెలు తీసుకొనేందుకు పూజా సామాగ్రీ విక్రయంకు సంబంధించి దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు రాజమహేంద్రవరం కు చెందిన గుర్రం సత్యవరప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ కార్య నిర్వహణధికారి జి.వి.లక్ష్మీ కుమార్ సమక్షంలో జరిగిన టెండర్ కమ్ వేలంలో గత సంవత్సరం జరిగిన వేలం కంటే రూ.2,38,000ఆదాయం ఆదాయం అదనంగా ఒనగూరింది. ఒక సంవత్సర కాలానికి నాడు జరిగిన వేలం కమ్ టెండర్‌లో కొబ్బరి చెక్కలు పాటను అదే గ్రామానికి చెందిన డి. పోసిబాబు వేలం ను రూ.1,22,000లకు ఛేజిక్కించుకొగా, అమ్మవారి ఫోటోలు విక్రయానికి సంబందించి రూ.88,000 కు బచ్చు అప్పారావు పాటలో పాల్గొని పాటను ఛేజిక్కించు కున్నారు. అదే విధంగా అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు రవికెలు తీసుకొనేందుకు జరిగిన వేలంలో ఎస్ రమ్య రూ.3,52,500లకు పాటను ఛేజిక్కించుకున్నారు. పూజా సామాగ్రి అమ్మకానికి జరిగిన వేలం ను రూ 1,55,000 మరొకరు వేలం ను ఛేజిక్కించుకున్నారు. ఈ నాలుగు అంశం లలో గతంలో రూ.4,79,500 లకు పాడుకోగా ఇప్పుడు ఈ నాలుగింటికి రూ.7,17,500లకు బహిరంగ వేలం పాట పాడుకోవటం జరిగింది. ఈ ఏడాది అదనంగా రూ.2,38,000 వచ్చింది. ఇదిలా ఉండగా ఆలయ అధికారులు సమాచార లోపమో పత్రికా ప్రకటన లేకపోవటమో ఆలయం వద్ద వ్యాపారులు మినహా బయట వ్యక్తులవ్వరూ టెండర్ కమ్ వేలం లో పాల్గొన్న దాఖలాలు లేకపోవటం నాడు జరిగిన వేలం టెండరింగ్ గా మారిందా అనే సందేహం నెలకొంది. అంతేకాక వేలంలో పాల్గొన్న వ్యాపారులు అందరూ గతంలో కాద్దోగాప్పో గత పాటల్లో వేలం సొమ్ములు బకాయి ఉన్నవాళ్లే. ఇదిలా ఉండగా ఏడాదిలో సగం రోజులు ఆలయం గోదావరి నీట ముంపులో ఉండటం వ్యాపారులు ఎలా తమ వ్యాపారం లో సఫలీకృతం అవుతారో చూడాలి.

నేడే శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని పాత రాజుపేట వడ్డిగూడెం రాజుపేట కాలనీ గ్రామాలలో వెలసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాలను విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు. స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవం ఉదయం 10:30 గంటలకు అంగరంగ వైభవంగా మంగళ వాయిద్యాలు నడుమ భక్తజన సందోహంతో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించబడునని ఆయా ఆలయాల కమిటీల సభ్యులు తెలిపారు. స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లను చేస్తున్నారు. అలాగే స్వామివారి కళ్యాణ మహోత్సవ సందర్భంగా ఆలయ ప్రాంగణాలలో భక్త జనులందరికీ అన్నదాన కార్యక్రమాలకు ఏర్పాటు చేస్తున్నారు.